సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 5, జూన్, 2024



ఓట్ల కోసం కుస్తీలు
రాజకీయ పార్టీలు ఓట్ల కోసం కుస్తీలు పడుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. - IIలో



ఐటీ దాడులు
మిర్యాలగూడలోని పెద్ద బజారులో గల శ్రీదేవి ట్రేడర్స్‌లో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. - IIలో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
37° / 27°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9న జేసీజే మోడల్ టెస్టు

భువనగిరి క్రైం: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) మోడల్ టెస్టును హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల అంబేద్కర్ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కదూగు సోమయ్య, తడక మోహన్, జగతయ్య, కార్యదర్శి బొల్లెపల్లి కుమార్ పాల్గొన్నారు.

'రావి' కాంస్య విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

భువనగిరి రూరల్ : మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటుకు రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జూలై చివరికల్లా రావి నారాయణరెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి రావి సుఖేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్‌రావు, సంయుక్త కార్యదర్శి రావి హేమంత్‌రెడ్డి, కోశాధికారి తిరుమనిదాస్ వెంకటేశ్వర్లు, భువనగిరి సత్యనారాయణ, రావి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ గడ్డం విజయభార్గవ్, కట్రోజు విజయ్‌కుమార్, సీలోజు రాజలింగం, లక్ష్మణాచారి, మద్ది బాల్‌రెడ్డి, గడ్డమీది వీరయ్య, మాజీ జెడ్పీటీసీ సందెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం క్షేత్ర పాలకుడు శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. అంజనీపుత్రుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతోపాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయ స్వామికి సింధూరం, పాలతో అభిషేకించారు.


మోదీ మాటలను ప్రజలు విశ్వసించలేదు

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


భువనగిరిటౌన్ : కేంద్రంలో మరోమారు అధికారంలోకి వచ్చేందుకు మోదీ చెప్పిన మాయ మాటలను ప్రజలు విశ్వసించలేదని, అప్‌కీ బార్ చార్‌సౌ అనే నినాదాన్ని తిప్పికొట్టారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీగా ధ్రువీకరణపత్రం తీసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే దిశగా బీజేపీ ఉండగా.. దేశ ప్రజలు ఓటు అనే ఆయుధంతో కాపాడే ప్రయత్నం చేశారని తెలిపారు. ఎగ్జిట్‌పోల్స్ ద్వారా ప్రజలు, మీడియా సంస్థలను పక్కదోవ పట్టించిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ తన కుమార్తెను జైలు నుంచి విడుదల చేయించేందుకు బీజేపీతో ములాఖత్ అయ్యారని ఆరోపించారు. అందుకోసం ఎన్నికల్లో బలహీనమైన అభ్యర్థులను నిలబెట్టారని, బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి బదలాయింపు జరిగిందన్నారు. దీనికి నిదర్శనం ఎక్కడ కుడా బీఆర్‌ఎస్ రెండవ స్థానం రాకపోవడమేనన్నారు. కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీని శూన్యం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి కూడా అదే గతి పడుతుందన్నారు.

విజయ సంకేతం చూపుతున్న రఘువీర్






నల్లగొండ లోక్‌సభ స్థానం






భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ హాల్‌లో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

భువనగిరి లోక్‌సభ స్థానం





హస్తందే హవా

లోక్‌సభ ఎన్నికల్లో రెండు చోట్ల కాంగ్రెస్‌దే గెలుపు

- నల్లగొండలో కుందూరు రఘువీర్‌రెడ్డికి రికార్డు మెజారిటీ
- భువనగిరిలో కిరణ్‌కుమార్‌రెడ్డికి భారీ విజయం
- తొలి రౌండ్ నుంచి చివరిదాకా ఆధిక్యం కనబరిచిన హస్తం పార్టీ
- అభ్యర్థుల ఎంపికలో సక్సెస్ అయిన సీఎం రేవంత్
- తొలిసారిగా చట్టసభలో అడుగుపెడుతున్న యువ నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సాక్షి యాదాద్రి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లోనూ హస్తం హవానే కొనసాగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాలకు ఒక స్థానం మినహా 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే అత్యధిక మెజార్టీతో విజయం సాధించగా, మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్ సభ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించి నల్లగొండ హస్తం పార్టీకి కంచుకోట అని మరోసారి నిరూపించారు.

రఘువీర్‌రెడ్డికి రికార్డు మెజారిటీ

నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి రికార్డు స్థాయి మెజార్టీ సాధించారు. ఆయన 5,59,905 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో జిల్లాలో ఎవరికి కూడా ఇంత మెజార్టీ రాకపోగా రాష్ట్రంలో కూడా రాలేదు. అయితే దేశంలో అత్యధిక మెజార్టీతో గెలిచిన వారిలో రఘువీర్‌రెడ్డి ఒకరిగా నిలిచారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 6,29,143 ఓట్లు రాగా, 2,22,170 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రెండు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించి నల్లగొండ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.

ఐక్యంగా పనిచేసిన నాయకులు

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భువనగిరి ఎన్నికల ఇన్‌చార్జిగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. జిల్లాలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితోపాటు మాజీ మంత్రి జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలు, ఎమ్మెల్యేలంతా గట్టిగా పనిచేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో అసెంబ్లీ ఎన్నికల తరహాలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యతను కనబరిచింది. ఇదంతా నాయకులు ఐక్యంగా పనిచేయడం వల్లే జరిగింది.

సిట్టింగ్ స్థానాలు నిలబెట్టుకున్న కాంగ్రెస్

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాల్లో హుజూర్‌నగర్, మునుగోడు మినహా 10 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఆ తర్వాత నాలుగు నెలల్లో 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భువనగిరి ఎంపీగా పోటీచేయగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా పోటీచేశారు. వీరిరువురు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లోనూ రెండు పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గతంలో కంటే భారీ మెజారిటీతో నిలబెట్టుకుంది.



భువనగిరిలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

ఇద్దరూ సీఎం అనుచరులే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరులైన కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ గెలుపొందారు. వీరికి ముఖ్యమంత్రితో సత్సంబంధాలు ఉన్నాయి. వీరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలుపు బాధ్యతలను జిల్లా నేతలకే అప్పగించి మార్గనిర్దేశం చేశారు.



విజయ సంకేతం చూపుతున్న చామల

కాంగ్రెస్‌కు మూడోసారి..

భువనగిరి ఎంపీ స్థానాన్ని మూడోసారి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 2009లో నూతనంగా ఏర్పాటైన భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి ప్రస్తుత మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తొలిసారి గెలుపొందారు. 2014లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై టీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన పట్టు నిలుపుకుంది.

పోటీచేసిన మొదటిసారే విజయం



కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న కార్యకర్త

భువనగిరి ఎంపీగా పోటీచేసిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా ఎంపీగా విజయం సాధించారు. 2009లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆ తర్వాత 2014లో బూర నర్సయ్య గౌడ్ విజయం సాధించారు. వీరు ముగ్గురు చట్ట సభలకు తొలిసారిగా ఇక్కడి నుంచే ఎన్నికయ్యారు. 2019లో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తొలిసారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన అంతకుముందు నల్లగొండ ఎమ్మెల్యేగా పలుమార్లు గెలుపొందారు. ఎంపీగా మాత్రం భువనగిరి నుంచే తొలి విజయం సాధించారు. యూత్ కాంగ్రెస్ నాయకునిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భువనగిరిలో పోటీలో నిలిచి విజయం సాధించారు.



కిరణ్‌కుమార్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల పరిశీలకుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అయిలయ్య, అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు

తొలి రౌండ్ నుంచే 'చామల' ఆధిక్యత

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తొలి రౌండ్ నుంచే ఆధిక్యత కనబరిచారు. నియోజకవర్గ పరిధిలోని భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్, జనగామ, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 23 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. తొలి రౌండ్ భువనగిరి మండలం (రూరల్) నుంచి లెక్కింపు ప్రారంభం కాగా చివరి వరకు కాంగ్రెస్ ఆధికత్య కనబరుస్తూ వచ్చింది. ఆఖరి రౌండ్ ముగిసే సమయానికి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన బూర నర్సయ్యగౌడ్‌పై 2,22,170 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బూర నర్సయ్యగౌడ్ కౌంటింగ్ కేంద్రానికి రాలేదు. కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రంలో కలియదిరుగుతూ ఫలితాలను తెలుసుకున్నారు.

అన్ని రౌండ్లలో రఘువీర్‌కే..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: హోరాహోరీగా సాగిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి 5,59,905 ఓట్ల మెజారిటీతో విజయం దక్కింది. ఆయనకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలుపుకొని 7,84,337 ఓట్లు లభించాయి. సమీప ప్రత్యర్థి అయిన బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలుపుకొని 2,24,432 ఓట్లు లభించాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 2,18,417 ఓట్లు మాత్రమే లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థికి ప్రతి రౌండ్‌కు ఓట్లు పెరుగుతూ వచ్చాయి. తొలి రౌండ్ నుంచి ప్రతి రౌండ్‌లో ఆధిక్యం ప్రదర్శించారు. ప్రతి రౌండ్‌లో 20 వేలకు పైగా ఆధిక్యంలో ఉన్న రఘువీర్‌రెడ్డి చివరి మూడు రౌండ్లలో ఆధిక్యంలోనే ఉన్నా మెజార్టీ మాత్రం తగ్గింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ ఇతర పార్టీల అభ్యర్థులు ఎవరూ అధిక్యంలోకి రాలేదు. బీజేపీ కంటే బీఆర్‌ఎస్ మొదటి మూడు రౌండ్లలో ఆధిక్యం ప్రదర్శించినా ఆ తర్వాత తగ్గింది. కొన్ని రౌండ్లలో బీజేపీ అభ్యర్థి కంటే ఎక్కువ వచ్చినా చివరకు మూడో స్థానానికే పరిమితమైంది.

కేంద్రంలో ఇండియా కూటమికే అవకాశం

- 400 సీట్లు వస్తాయన్న వారు ఎక్కడున్నారు
- రఘువీర్ అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ముందే చెప్పా
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- అంతా కలిసి పనిచేయడం వల్లే అధిక మెజార్టీ
- మాజీ మంత్రి జానారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జానారెడ్డి, చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తర్వాత కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్ద మంత్రి మాట్లాడారు. రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని తాను ముందే చెప్పానని అన్నారు. రఘువీర్‌ను దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేసిన మంత్రి ఉత్తమ్‌తోపాటు ఎమ్మెల్యేలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తాను కలిసి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, ఆ తర్వాత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. భువనగిరిలో కూడా 2 లక్షల పైచిలుకు మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారన్నారు. 400 సీట్లు వస్తాయని చెప్పిన బీజేపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ రఘువీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసికట్టుగా పని చేయడం వల్లే అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. రఘువీర్ 5.5 లక్షల మెజార్టీతో విజయం సాధిస్తారని పోలింగ్ జరిగిన మరుసటి రోజే తాను చెప్పానని అన్నారు. కాంగ్రెస్‌తో కలిసి వచ్చిన పార్టీలకు ఈ సందర్భంగా జానారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. వారివెంట ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- రెండు రోజులు కొనసాగే అవకాశం

నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు బుధవారం ఉదయం 9 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఈ ప్రకియలో భాగంగా మొదట బండిల్స్ కట్టే ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిని ఒక ట్రంక్ పెట్టిలో ఏఆర్‌ఓ టేబుల్‌పై ఉంచి కలుపుతారు. ఈ ప్రక్రియ అంతా మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తవుతుంది. ఆ తర్వాత రెండో షిఫ్టు సిబ్బంది డ్యూటీలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు 6వ తేదీ ఉదయం వరకు కొనసాగనుంది. ఏ అభ్యర్థికైనా గెలుపునకు సరిపడా ఓట్లు వస్తే సరే. రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ ఎలిమినేషన్ ప్రక్రియ 6వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతుంది. మొదటి ప్రాధాన్యతలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ వారికి పడిన రెండో ప్రాధాన్యత ఓట్లను ఎవరెవరికి వేశారో ఆయా అభ్యర్థులకు కలుపుతారు. అలా చెల్లుబాటు అయిన ఓట్లలో సగానికి మించి మించి ఒక్క ఓటు వచ్చేంత వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఏ అభ్యర్థికి అయితే ఆ సంఖ్య వస్తుందో వారిని విజేతగా ప్రకటిస్తారు. ఇలా ఓట్ల లెక్కింపు ప్రక్రియ 2 నుంచి 3 రోజుల వరకు కొనసాగే అవకాశం ఉంది.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మూడో స్థానానికి బీఆర్‌ఎస్

- రెండో స్థానానికి ఎగబాకిన బీజేపీ
- అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినన్ని ఓట్లు కూడా సాధించని బీఆర్‌ఎస్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లాలో మూడో స్థానానికి పడిపోయింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఘోర పరాజయం చవిచూసింది. 12 అసెంబ్లీ నియోజక వర్గాలకుగాను సూర్యాపేట మినహా 11 చోట్ల ఓడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో రెండో స్థానంలోనే నిలువగా బీజేపీ 3వ స్థానంలో ఉంది. అయితే ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీజేపీ అనూహ్యంగా పుంజుకోగా బీఆర్‌ఎస్ మాత్రం మూడో స్థానానికి పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 7,66,069 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 4,78,631 ఓట్లు వచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మాత్రం కేవలం 73,449 ఓట్లతో (5.08 శాతం) సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి 7,84,337 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి 2,24,431 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి 2,18,400 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు.

పడిపోయిన బీఆర్‌ఎస్ గ్రాఫ్..

శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోయిన చోట రెండో స్థానంలో నిలవగా.. లోక్‌సభ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది. నల్లగొండ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల బీజేపీ కంటే బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఓట్లు రాగా.. నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మాత్రం బీజేపీ రెండో స్థానంలో నిలిచి.. 51,451 ఓట్లు సాధించింది. దీంతో బీజేపీ రెండో స్థానం దక్కించుకుని.. బీఆర్‌ఎస్ పార్టీని మూడవ స్థానంలోకి నెట్టింది.

సోనియా, రాహుల్‌గాంధీకి అంకితం

- ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి

భువనగిరిటౌన్ : భువనగిరి పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడం సంతోషంగా ఉందని, ఈ గెలుపు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అంకితమిస్తున్నామని భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరిలోని పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. భువనగిరి గడ్డ కాంగ్రెస్ అడ్డా అని ప్రజలు నిరూపించారన్నారు. భువనగిరి పార్లమెంటులో చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించిన భువనగిరి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలు ఆలోచన చేసి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మద్దతుగా నిలిచి ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎంపీలను గెలిపించారన్నారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి భువనగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



భువనగిరిలోని కౌంటింగ్ కేంద్రం వద్ద సెల్ఫీ దిగుతున్న ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు



భువనగిరిలోని కౌంటింగ్ కేంద్రం వద్ద విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, సామేల్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఐలయ్య, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి



భువనగిరిలోని కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది



నల్లగొండలో విక్టరీ సింబల్ చూపుతున్న మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, బాలునాయక్, జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగిపోతున్న బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది



నల్లగొండ కౌంటింగ్ సెంటర్‌లో ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన



నల్లగొండలోని కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు



నల్లగొండలో సీల్ చేసిన ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

అన్న ఎంపీ.. తమ్ముడు ఎమ్మెల్యే

- ఒకే ఇంటి నుంచి ఇద్దరు ప్రజాప్రతినిధులు



కుటుంబ సభ్యులతో కలిసి విజయ సంకేతం చూపిస్తున్న రఘువీర్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి, జానారెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఒకే ఇంటినుంచి ఇద్దరు ప్రజాప్రతినిధులుగా విజయం సాధించారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి చిన్న కుమారుడు జైవీర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా గెలుపొందగా.. పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా 5,59,906 ఓట్ల రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎమ్మెల్యేగా గెలిచి రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా ఉండగా.. ఆయన సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉండగా.. ఆయన సతీమణి పద్మావతి కోదాడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కర్మన్‌ఘాట్ దేవాలయంలో 'చామల' పూజలు



తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: హైదరాబాద్‌ని కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి వెళ్లారు.

స్వగ్రామంలో జహంగీర్‌కు ఆదరణ

రామన్నపేట : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎండీ జహంగీర్ స్వగ్రామం రామన్నపేట మండలంలోని మునిపంపుల. జహంగీర్‌కు మే 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గ్రామప్రజలు మెజార్టీ ఓట్లు వేసి ఆదరించారు. గ్రామంలో మొత్తం 2200ఓట్లు ఉండగా 1723ఓట్లు పోలయ్యాయి. జహంగీర్‌కు 684ఓట్లురాగా, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు 431ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 417ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు 126ఓట్లు వచ్చాయి. జహంగీర్ 1995లో మునిపంపుల సర్పంచ్‌గా ఎన్నికై గ్రామానికి విశిష్టమైన సేవలు అందించారు. అనంతరం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. జహంగీర్ నామినేషన్ వేయడానికి అవసరమైన డబ్బులను గ్రామస్తులే సమకూర్చి అందించడం గమనార్హం. అదే విధంగా వివిధ ప్రాంతాలలో ఉండే ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

వలిగొండ: మహిళను వేధిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం వలిగొండ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన వేముల నరేందర్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నరేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో..

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
కుందూరు రఘువీర్‌రెడ్డి	కాంగ్రెస్	7,84,337
శానంపూడి సైదిరెడ్డి	బీజేపీ	2,24,432
కంచర్ల కృష్ణారెడ్డి	బీఆర్ఎస్	2,18,417
జానయ్యనందిపాటి	టీఎస్‌కేపీ	10,859
అంజయ్య విరిగినేని	బీఎస్పీ	7,177
తలారి రాంబాబు	ధర్మసమాజ్	5,122
ఆర్.సుభద్రారెడ్డి	సోషలిస్టుపార్టీ	846
వస్కుల మట్టయ్య	ఎంసీపీఐ	1,040
కిన్నెర యాదయ్య	స్వతంత్ర	947
కుందారపు శ్రీకాంత్	స్వతంత్ర	947
కుక్కల వెంకన్న	స్వతంత్ర	2,566
గోలి సైదులు	స్వతంత్ర	1,779
చొల్లేటి ప్రభాకర్	స్వతంత్ర	2,504
పానుగోటు లాల్‌సింగ్	స్వతంత్ర	5,286
బొలిసెట్టి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	3,212
బండారు నాగరాజు	స్వతంత్ర	7,128
మద్రినెహిమియా	స్వతంత్ర	1,662
మారం వెంకట్‌రెడ్డి	స్వతంత్ర	5,967
రమేష్ సుంకర	స్వతంత్ర	3,569
రవి పాలకూరి	స్వతంత్ర	1,547
లింగం కృష్ణ	స్వతంత్ర	666
సిరిశాల శీనయ్య	స్వతంత్ర	514
నోటా	--	5,869

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో..

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
చామల కిరణ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	6,29,143
డాక్టర్ బూరనర్సయ్యగౌడ్	బీజేపీ	4,06,973
క్యామ మల్లేష్	బీఆర్ఎస్	2,56,187
ఎండీ.జహంగీర్	సీపీఎం	28,730
అయితరాజు అభేందర్	బీఎస్పీ	7,769
ఎర్ర సూర్యం	విడుతలై చిరుతలైగళ్ కచ్చి	778
కందాడి మణిపాల్‌రెడ్డి	తెలంగాణ రిపబ్లికన్‌పార్టీ	433
కదిరేకిరణ్‌కుమార్‌రెడ్డి	బహుజన్ రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ	478
కరుణాకర్‌రెడ్డి నల్ల	జైభారత్ నేషనల్ పార్టీ	447
కొంగరి లింగస్వామి	ధర్మసమాజ్ పార్టీ	4093
కొత్తోజు శ్రీనివాస్	నేషనల్ మహాసభ పార్టీ	569
తరిగొప్పుల మహేందర్	సోషల్ జస్టిస్‌పార్టీ ఆఫ్ ఇండియా	3,089
ధరావత్ గోపినాయక్	జై మహాభారత్ పార్టీ	1682
నరేంద్ర వేముల	జై స్వరాజ్ పార్టీ	4,304
పులిగిల్ల భిక్షపతియాదవ్	నేషనల్ నవక్రాంతి పార్టీ	4718
పూస శ్రీనివాస్	తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణసమితి	1,433
ఎం. గణేష్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	2,010
రచ్చ సుభద్రారెడ్డి	సోషలిస్ట్‌పార్టీ ఆఫ్ ఇండియా	1,465
తాళ్లపల్లి రమేష్‌గౌడ్	అలయెన్స్ డెమక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ	8,146
లింగిడి వెంకటేశ్వర్లు	ప్రజా వాణీ పార్టీ	1,792
వి. సదానందరెడ్డి	పీపుల్ ప్రొటెక్షన్‌పార్టీ	1,737
అనిల్‌కుమార్ గాదెపాక	స్వతంత్ర	393
ఉదరి మల్లేష్	స్వతంత్ర	406
అన్‌రెడ్డి కిరణ్‌రెడ్డి	స్వతంత్ర	541
కండె రామరాజు	స్వతంత్ర	579
కాలింగుల యాదగిరి	స్వతంత్ర	2,612
కొంగరి మల్లయ్య	స్వతంత్ర	633
జంగ సుజాతానవీన్‌రెడ్డి	స్వతంత్ర	847
నర్రి స్వామి కుర్మ	స్వతంత్ర	898
బేతి నరేందర్	స్వతంత్ర	2,168
నూనె వెంకటస్వామి	స్వతంత్ర	923
పెంట రమేష్	స్వతంత్ర	1647
భాషబోయిన లక్ష్మయ్య	స్వతంత్ర	1,320
బూషపాక వెంకటయ్య	స్వతంత్ర	4,675
అసుర బాలు	స్వతంత్ర	5,750
మల్లెబోయిన పరమేష్‌యాదవ్	స్వతంత్ర	1,897
మెగావత్ చందునాయక్	స్వతంత్ర	502
డాక్టర్ మొరిగాడి కృష్ణ	స్వతంత్ర	617
వరికుప్పల కృష్ణవడ్డెర	స్వతంత్ర	1,366
నోటా	--	4,646

భువనగిరిలో కాంగ్రెస్ సంబరాల్లో అపశ్రుతి

- ఎమ్మెల్యే కాన్వాయ్ పైనుంచి పడి యువకుడికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిచిన తర్వాత పట్టణంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంతో నిర్వహించిన సంబరాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా భువనగిరి పట్టణానికి చెందిన జలీల్‌పుర వాసి ఉజేర్(18) కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాన్వాయ్‌పై వేలాడుతుంటూ ప్రయాణిస్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని పంజాగుట్టలో గల నిమ్స్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అతడిని నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఓట్ల కోసం కుస్తీలు పడుతున్న పార్టీలు

- పదేళ్లలో బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేసింది
- మోదీకి ప్రభుత్వం ఏర్పాటు చేయడమే కష్టంగా మారింది
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సౌమ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తదితరులు

యాదగిరిగుట్ట: దేశంలో ఓట్ల కోసం రాజకీయ పార్టీలు అనేక కుస్తీలు పడుతున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో 400 సీట్లు వస్తాయని గొప్పలు చెప్పిన మోదీ.. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే అనుమానంగా ఉందన్నారు. పదేళ్లలో బీజేపీ దిగజారిన రాజకీయాలను అనుసరించిందని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, ఐదు సంవత్సరాల పాటు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించి, సగటుగా ప్రతి కుటుంబానికి రూ.1లక్ష మేర లబ్ధి చేకూర్చారని చెప్పారు. అయినప్పటికీ ఓటమిచెందారని పేర్కొన్నారు. నరేంద్రమోదీకి ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై లెక్కలేకుండా పోయిందన్నారు. తమిళనాడు లో చిన్న, చితక పార్టీలు కలిసి అక్కడ గొప్ప విజయం సాధించాయన్నారు. తమిళనాడును అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం సమన్వయంతో అందరినీ కలుపుకొని పనిచేయాలని నారాయణ సూచించారు.

సౌమ్య కుటుంబానికి పరామర్శ

ఇటీవల అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లికి చెందిన గుడ్ల సౌమ్య కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. సౌమ్య మృతిచెందిన విషయాన్ని స్థానిక పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకురాగానే వెంటనే రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అమెరికాలో ఉన్న తన స్నేహితులు, తానా మహాసభ ప్రతినిధులతో మాట్లాడి మృతదేహాన్ని యాదగిరిపల్లికి తీసుకువచ్చే ప్రయత్నం చేశామని నారాయణ తెలిపారు. ఇక్కడి నుంచి అమెరికాకు వెళ్లిన విద్యార్థులకు అక్కడ ఏమి జరిగినా, ప్రమాదవశాత్తు ఎవరైనా మరణించినా అమెరికా ప్రభుత్వం చొరవ తీసుకొని సొంత ప్రాంతాలకు పంపించాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమెరికానే కాకుండా ఇతర దేశాల ప్రభుత్వాలతో మాట్లాడి వీసా ఇచ్చిన తర్వాత పూర్తి బాధ్యత తీసుకొని సాయం చేసేలా కృషిచేయాలన్నారు. వారి వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఏశాల అశోక్, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్ తదితరులున్నారు.

రౌండ్ల వారీగా ఓట్ల వివరాలు

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్ లీడ్
1	37,984	11,796	10,970	26,188
2	39,947	12,743	12,167	27,204
3	34,010	11,549	11,185	22,461
4	33,195	9,831	12,723	20,472
5	36,612	10,219	11,649	24,966
6	40,934	8,964	13,548	27,386
7	38,453	7,908	14,376	24,077
8	36,706	9,159	12,772	23,934
9	36,922	9,877	13,808	23,114
10	34,809	10,565	12,728	22,081
11	36,219	9,342	11,708	24,511
12	38,121	10,852	10,797	27,269
13	36,085	10,471	11,034	25,051
14	34,463	10,495	7,833	23,968
15	39,381	10,146	8,858	29,235
16	38,309	10,036	9,167	28,273
17	38,345	10,280	8,151	28,065
18	38,132	11,773	7,188	26,359
19	38,193	10,253	8,169	27,940
20	28,179	7,692	6,233	20,487
21	24,634	6,764	4,462	17,870
22	15,566	5,297	2,556	10,269
23	3,311	1,300	486	2,011
24	1,752	631	261	1,121

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ..

రౌండ్	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	కాంగ్రెస్ లీడ్
01	15361	29783	19983	9800
02	13619	31203	22708	8495
03	13491	31372	23584	7788
04	14042	31833	20044	11789
05	13728	29778	20857	8921
06	13177	32147	20256	11891
07	13640	31628	23285	8343
08	12713	33527	23343	10184
09	14631	35035	20554	12973
10	13683	31790	22436	9354
11	13094	31708	24666	7042
12	13380	31512	22292	9220
13	12952	31967	21875	10092
14	13182	34438	20607	13831
15	13141	33619	19827	13792
16	12811	32624	17714	14910
17	12512	33803	19110	14693
18	9750	26493	15700	10793
19	4564	16337	8216	8121
20	4581	12614	6240	6374
21	3206	9799	4040	5759
22	3241	9321	3718	5603
23	339	1431	458	973

నీట్ ఫలితాల్లో 'జయ' విద్యార్థుల విజయకేతనం



ఎస్‌కె.అఫ్నాన్



పి.సాయిశివానీ



ఎస్.వరప్రసాద్



సమ్‌రీన్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని జయ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి బ్యాచ్ విద్యార్థులు నీట్ 2024 ఫలితాల్లో జాతీయ ర్యాంకులు సాధించి నలుగురు విద్యార్థులు మెడికల్ సీట్లు పొందినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కె.అఫ్నాన్ 537, పి.సాయిశివానీ 531, ఎస్.వరప్రసాద్ 529, సమ్‌రీన్ 412జాతీయ స్థాయిలో మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో నీట్ ప్రోగ్రాంలో పాల్గొన్న 10మంది విద్యార్థుల్లో నలుగురు మెడికల్ సీట్లు పొందారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జిల్లా పద్మ అభినందించారు.

బంగారం దుకాణంలో ఐటీ దాడులు



బంగారం దుకాణంలో తనిఖీలు చేసి బయటకు వస్తున్న ఐటీ అధికారులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల శ్రీదేవి ట్రేడర్స్ బంగారం దుకాణంలో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. గత వారం ఏపీలోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు మహిళల నుంచి రూ.1.61 కోట్ల నగదును అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వెంకటాచలం టోల్‌గేట్ వద్ద 1.658కిలోల బంగారంతో పాటు ప్రకాశం జిల్లా టంగుటూరు వద్ద కారులో వెళ్తున్న దంపతుల నుంచి రూ.90 లక్షల విలువైన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు. వారిచ్చిన సమాచారం మేరకు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీదేవి ట్రేడర్స్ బంగారం దుకాణానికి వచ్చి రికార్డులను పరిశీలించారు. సుమారు 3గంటలకు పైగా వివరాలు సేకరించిన ఐటీ అధికారులు మీడియాకు ఎలాంటి వివరాలు వెల్లడించకుండానే వెళ్లిపోయారు. ఐటీ అధికారుల దాడులతో బంగారం దుకాణం నిర్వాహకులు షాపులను మూసివేశారు.

రోడ్డు ప్రమాదంలో పశువైద్యుడు మృతి



అనుదీప్ (ఫైల్)

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో పశువైద్యుడు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలో మంగళవారం జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నివాసముంటున్న అనుదీప్(34) మంగళవారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై నల్లగొండ పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి రాత్రి హైదరాబాద్‌కు వెళ్తుండగా పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ ఫోకస్‌కు రోడ్డు కనిపించక డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనుదీప్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు మిర్యాలగూడ మండలం తుంగపహాడ్‌లో పశువైద్యుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: భువనగిరి మండలం పగిడిపల్లి గ్రామ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం పొతాయిపల్లికి చెందిన నల్ల వెంకటేష్(32) హైదరాబాద్‌లో వాటర్ ప్లాంట్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో వెంకటేష్‌ను రిపేర్ చేసేందుకు పిలిపించాడు. అర్ధరాత్రి వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఆలయ సిబ్బంది గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం మృతుడి సోదరుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూము షట్టర్, రాడ్లు చోరీ

నేరేడుచర్ల: నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్‌పీ) ఎడమ కాలువ పరిధిలోని జాన్‌పహాడ్ మేజర్‌పై ఉన్న తూము షట్టర్‌తో పాటు రాడ్లను సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు. దిర్శించర్ల గ్రామానికి చెందిన వేముల రాజు, వేముల శ్రీకాంత్ చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. ఎన్ఎస్‌పీ కెనాల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రెబ్బ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దొంగలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.